## విలేకరులు కావలెను

ప్రతిజ్ఞ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
వేణు
**7032356032**



# ప్రతిజ్ఞ

తెలుగు దిన పత్రిక

ప్రజాహితం - మా అభిమతం





PUBLISHED FROM : హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి | ఎడిటర్ : మోదుగు వేణు | మంగళవారం 14 ఏప్రిల్ 2026


## కెసిఆర్ కు లీగల్ నోటీసు జారి చేసిన సీతక్క

ప్రతిజ్ఞ ఏప్రిల్ 12


బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీస్.. తన ప్రతిష్ఠకు భంగం వాటిల్లేలా బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారంటూ కేసీఆర్‌కు సీతక్క లీగల్ నోటీసు.. అంగన్వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలుపై బీఆర్ఎస్ ఆరోపణలు.. బీఆర్ఎస్ సోషల్ మీడియాలో దుష్ప్రచారానికి కేసీఆర్‌దే బాధ్యత.. 48 గంటల్లో పోస్టులు తొలగించి కేసీఆర్ క్షమాపణలు చెప్పాలి.. లేకుంటే సివిల్, క్రిమినల్ చర్యలు ఉంటాయని హెచ్చరిక




## బాత్‌రూములో యువతి శవం నాలుగు రోజుల తర్వాత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:



జార్ఖండ్‌లో ఒళ్లుగగుర్పొడిచే సంఘటన ఒకటి చోటుచేసుకుంది. ఓ యువతి సగం కాలిన స్థితిలో ఇంటి బాత్‌రూములో శవమై కనిపించింది. యువతి చనిపోయిన 4 రోజుల తర్వాత కుళ్లిన స్థితిలో శవం బయటపడ్డం స్థానికులను షాక్‌కు గురి చేసింది. చెల్లెలు చనిపోయి నాలుగు రోజులు అవుతున్నా.. శవం కుళ్లిపోతున్నా యువతి అన్న ఈ విషయాన్ని బయటకు చెప్పకపోవటం తీవ్ర చర్చకు దారి తీసింది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. ధన్‌బాద్‌కు చెందిన లిపిక అనే యువతి.. తండ్రి, ఇద్దరు అన్నలతో కలిసి గోవింద్‌పూర్‌లోని ఇంట్లో నివసిస్తోంది. 2023లో తండ్రి చనిపోవటంతో లిపిక డిప్రెషన్‌లోకి వెళ్లిపోయింది. ఏప్రిల్ 7వ తేదీన తీవ్ర అనారోగ్యానికి గురైంది. వాంతులు కూడా చేసుకుంది. అన్న ప్రణవ్ ఆమెకు సపర్యలు చేశాడు. అయితే, యువతి ఆరోగ్యం కుదుటపడలేదు. కొద్దిసేపటి తర్వాత ప్రాణాలు కోల్పోయింది. లిపిక మరణించి నాలుగు రోజులు గడిచిపోయాయి. చెల్లెలు చనిపోయిన సంగతి ప్రణయ్ ఎవ్వరికీ చెప్పలేదు. ఆ శవాన్ని ఇంట్లోనే పెట్టుకున్నాడు. నాలుగు రోజులు గడిచే సరికి శవం కుళ్లి పురుగులు పట్టాయి. చెల్లెలి శవానికి పురుగులు పట్టడంతో ప్రణయ్ పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఆ ఇంటినుంచి శవం కాలుతున్న వాసన రావటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రణయ్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. బాత్‌రూములో లిపిక శవం వెలుగు చూసింది. పోలీసులు శవాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. లిపిక ఇద్దరు అన్నలను విచారిస్తున్నారు.

## యూఎస్‌కు ఇరాన్ వార్నింగ్ ఏ పొరపాటు చేసినా




ఇంటర్నెట్ డెస్క్:

హోర్ముజ్‌ను దిగ్బంధిస్తామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ మరోసారి ఘాటుగా స్పందించింది. హోర్ముజ్ ఇప్పటికీ తమ నియంత్రణలోనే ఉందని పేర్కొంది. శత్రువులు ఏ చిన్న పొరపాటు చేసినా ప్రమాదం తప్పదని హెచ్చరించింది. అంతకుముందు ఇరాన్ సైనిక దళం (ఐఆర్‌జీసీ) కూడా ట్రంప్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. హోర్ముజ్ వైపు వచ్చే యుద్ధ నౌకలపై దాడి చేస్తామని హెచ్చరించింది. పౌర నౌకల రాకపోకలకు మాత్రం ఎలాంటి ఇబ్బందీ ఉండదని భరోసా ఇచ్చింది. యుద్ధ నౌకలు వస్తే మాత్రం కాల్పుల విరమణను ఉల్లంఘించినట్టేనని స్పష్టం చేసింది. ఇక యూఎస్‌తో చర్చలు విఫలం కావడంపై ఇరాన్ మంత్రి అరాగ్చీ ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 47 ఏళ్ల తరువాత జరిగిన అత్యున్నత స్థాయి చర్చలకు తాము సదుద్దేశంతో వెళ్లామని చెప్పారు. ఒప్పందం అంగుళం దూరంలో ఉండగా యూఎస్ తన లక్ష్యాలను, ఉద్దేశాలను మార్చుకుందని ఆరోపించారు. మునుపటి అనుభవాల నుంచి ఎలాంటి గుణపాఠాలను అమెరికా నేర్చుకోలేదని అన్నారు. మంచి భావాలుంటే చివరకు మంచే జరుగుతుందని అన్నారు. మనసులో శత్రుత్వం ఉంటే తుదకు అదే మిగులుతుందని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. సోమవారం హోర్ముజ్‌లో నౌకల ట్రాఫిక్ స్తంభించిపోయిందని లాయిడ్స్ లిస్ట్ ఇంటెలిజెన్స్ అనే మారిటైమ్ సంస్థ తాజాగా పేర్కొంది. హోర్ముజ్‌ను దిగ్బంధిస్తామన్న ట్రంప్ ప్రకటన తరువాత నౌకల రాకపోకలు నిలిచిపోయాయని పేర్కొంది. ఎలాంటి ఒప్పందం లేకుండా ఇరాన్‌తో చర్చలు ముగియడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పందించారు. గతంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం మాత్రం కొనసాగుతోందని అన్నారు. ఇరాన్ మళ్లీ చర్చలకు వస్తుందా? రాదా? అనేది తనకు ఇక అనవసరమని కూడా చెప్పారు. ఇప్పటికే ఇరాన్ పరిస్థితి దగజారిందని, మిలిటరీ ధ్వంసమైపోయిందని చెప్పారు.

## రియల్ టైమ్ గవర్నెన్స్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి:




ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ (RTG) సమావేశం జరిగింది. వెలగపూడి సచివాలయంలోని RTGS కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో డేటా డ్రివెన్ డిసిషన్ మేకింగ్‌పై ఉన్నతస్థాయి చర్చ జరిగింది. పాలనలో డేటా వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం, రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థ పనితీరును సమీక్షించారు. ముఖ్య శాఖల కార్యదర్శులతో పాటు ఫైనాన్స్, ప్లానింగ్, వెల్ఫేర్ శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డేటా లేక్ నిర్మాణం, టెక్నాలజీ వినియోగం, డేటా అనలిటిక్స్ ద్వారా నిర్ణయాలు తీసుకునే విధానాలపై చర్చించారు. పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. RTGS, APSDMA, APSFL సంస్థల ప్రతినిధులతో పాటు డిజిటల్ కార్పొరేషన్, ట్రికోర్, వాసర్ ల్యాబ్స్ ప్రతినిధులు కూడా సమావేశంలో హాజరయ్యారు. అన్న క్యాంటీన్ ట్రస్ట్, గ్రామ-వార్డు సచివాలయాల (GSWS) అధికారులు కూడా పాల్గొన్నారు. డేటా అనలిటిక్స్ ఆధారంగా నిర్ణయాలు తీసుకునే దిశగా చర్యలు చేపట్టాలని సీఎం అధికారులకు సూచించారు. అలాగే సంబంధిత అన్ని శాఖలు పరస్పరం సమన్వయంతో పని చేయాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లపై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్:




డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. డీలిమిటేషన్ అనేది రాజకీయ పార్టీలకో, ప్రభుత్వానికో సంబంధించిన అంశం కాదని స్పష్టం చేసిన సీఎం రేవంత్, దీనిని మహిళా రిజర్వేషన్లతో కలిపి చూపించడం సరైంది కాదన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ రెండు అంశాలను కలిపి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని విమర్శించారు.

**-దుష్ప్రచారం జరుగుతోంది**

మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా దుష్ప్రచారం జరుగుతోందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మహిళలకు ఓటుహక్కు, రాజకీయ రిజర్వేషన్లు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళలు ముఖ్యమైన పదవులు చేపట్టిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.

**-రెండూ వేర్వేరు**

మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ రెండూ వేర్వేరు అంశాలని స్పష్టం చేసిన రేవంత్ రెడ్డి, వీటిని కలిపి బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తోందని విమర్శించారు. ముఖ్యంగా 2011 జనాభా లెక్కల ఆధారంగా ఈ రెండు అంశాలను అనుసంధానించడం వెనుక రాజకీయ కుట్ర, వివక్ష ఉన్నాయని అన్నారు.

**-మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు**

మహిళా రిజర్వేషన్ బిల్లుకు తమ పూర్తి మద్దతు ఉందని ప్రకటించిన సీఎం రేవంత్, ప్రస్తుతం ఉన్న పార్లమెంట్ సీట్ల ఆధారంగానే ఈ బిల్లును అమలు చేయాలని కేంద్రాన్ని కోరారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలోనే ఈ బిల్లును అమలు చేసి ఉంటే, మరింత మంది మహిళలు పార్లమెంట్‌కు ఎన్నికయ్యేవారని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

## చర్చల్లో ప్రతిష్టంభన ట్రంప్ తదుపరి వ్యూహం ఇదేనా?

ఇంటర్నెట్ డెస్క్:




యూఎస్-ఇరాన్ చర్చలు విఫలం కావడంతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు చెలరేగాయి. ఇరాన్ పోర్టుల నుంచి నౌకలు హోర్ముజ్ మీదుగా రాకపోకలు సాగించకుండా నేటి సాయంత్రం 7.30 (భారత కాలమానం ప్రకారం) నిర్బంధం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దీంతో పాటు ఇరాన్‌పై యూఎస్, ఇజ్రాయెల్‌లు మళ్లీ దాడులు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అణు కార్యక్రమాన్ని వదులుకునేలా ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ఇజ్రాయెల్ దాడులను ప్లాన్ చేస్తున్నట్టు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఆర్మీ సిద్ధంగా ఉండాలని ఇప్పటికే ఇజ్రాయెల్ రక్షణ దళం చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ జమీర్ ఆదేశించారు. మరోవైపు, ఇరాన్‌పై పరిమిత స్థాయిలో దాడులు చేసేందుకు ట్రంప్, ఆయన సలహాదారులు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇరాన్‌ను అన్ని వైపుల నుంచి దిగ్బంధించి చర్చల్లో ప్రతిష్టంభనను తొలగించాలనేది యూఎస్ ప్రభుత్వం ఉద్దేశమని కథనాలు వెలువడ్డాయి. ఈ దిశగా నాటో దేశాలను కూడా రంగంలోకి దింపేందుకు అమెరికా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే హోర్ముజ్ మీదుగా నౌకల రాకపోకలను ఇరాన్ నిలిపివేసిన విషయం తెలిసిందే. హోర్ముజ్ జలాల్లోకి యూఎస్ యుద్ధ నౌకలు వస్తే దాడులు తప్పవని హెచ్చరించింది. చర్చలు విఫలం కావడానికి అమెరికానే కారణమని తేల్చి చెప్పింది. యూఎస్ పెట్టిన అసమంజసమైన డిమాండ్స్ కారణంగానే చర్చల్లో పీటముడి పడిందని పేర్కొంది. అణు కార్యక్రమం వదులుకునే దిశగా ఇరాన్ నుంచి స్పష్టమైన హామీలు రాలేదని యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు.

# హనుమకొండలో 'అరైవ్-అలైవ్' రోడ్డు భద్రత అవగాహన సదస్సు





ప్రతిజ్ఞ పత్రిక వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరో 13 ఏప్రిల్ 2026

హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో ప్రజాపాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా 'అరైవ్-అలైవ్' రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్ పేయి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హాజరయ్యారు. రహదారి భద్రతపై ముఖ్యంగా యువతలో చైతన్యం కల్పించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. 'అరైవ్-అలైవ్' కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాకుండా సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో ప్రమాదాలకు కారణమయ్యే బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థులు, యువత ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచడంలో ముందుండాలని పిలుపునిచ్చారు. తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా ఈ విషయాన్ని తెలియజేయాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రజాపాలన 99 రోజుల ప్రణాళిక ప్రజల భద్రత, సమస్యల పరిష్కారానికి దోహదపడుతోందని పేర్కొన్నారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీజేపీ రాజకీయ నాటకం

# ప్రజలు నిజాలు తెలుసుకోవాలి

ప్రతిజ్ఞ పత్రిక వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరో 13 ఏప్రిల్ 2026

హైదరాబాద్ గాంధీభవన్‌లో నిర్వహించిన పత్రికా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ బిల్లును బీజేపీ ప్రభుత్వం కేవలం రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకుంటోందని విమర్శించారు. త్వరలో జరగనున్న తమిళనాడు మరియు పశ్చిమ బెంగాల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ బిల్లును ముందుకు తీసుకువస్తున్నారని తెలిపారు. మహిళా రిజర్వేషన్ అంశంపై కాంగ్రెస్ పార్టీ 40 సంవత్సరాల క్రితమే చర్చలు ప్రారంభించిందని, రాజీవ్ గాంధీ నాయకత్వంలో దీనికి పునాది పడిందని పేర్కొన్నారు. మార్గరెట్ ఆల్వా నాయకత్వంలో పార్లమెంట్ కమిటీ ఏర్పడి చర్చలు జరిగినట్లు చెప్పారు. 2010లో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం రాజ్యసభలో ఈ బిల్లును ఆమోదించిందని, కానీ తరువాత అమలు కాలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం బీజేపీ తీసుకొచ్చిన చట్టం ప్రకారం జనగణన మరియు డిలిమిటేషన్ పూర్తయ్యాక మాత్రమే మహిళా రిజర్వేషన్ అమలు అవుతుందని, అది 2034 తర్వాత జరిగే అవకాశముందని అన్నారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే బీజేపీ గతంలోనే దీనిని అమలు




చేయాల్సిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1992లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీ రాజ్ వ్యవస్థలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి లక్షలాది మహిళలకు అవకాశాలు కల్పించిందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీతో పాటు ఓబీసీలకు కూడా ఈ రిజర్వేషన్‌లో వాటా ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తుందని తెలిపారు. డిలిమిటేషన్ ప్రక్రియ దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే అవకాశముందని, దీనిపై సమగ్ర చర్చ అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రజలు బీజేపీ రాజకీయ నాటకాన్ని గమనించాలని ఆమె కోరారు.

# దుద్దిళ్ల శ్రీపాదరావుకు ఘన నివాళులు ఆయన

# సేవలను స్మరించుకుందాంఅఎర్రబెల్లి స్వర్ణ

ప్రతిజ్ఞ పత్రిక వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరో 13 ఏప్రిల్ 2026

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా, మంథని నియోజకవర్గానికి అంకితభావంతో పనిచేసిన నేత శ్రీపాదరావు. నిరాడంబరత, నిజాయితీ ఆయన సొంతం అని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. ఈరోజు శ్రీపాదరావు వర్ధంతి సందర్భంగా గాంధీ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు స్పీకర్‌గా అందరి మన్ననలు పొందడమే కాకుండా, మారుమూల మంథని నియోజకవర్గంతో పాటు రాష్ట్రం నలుమూలల అభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయులు శ్రీపాదరావు. నిరాడంబరతకు, నిజాయితీకి నిలువుటద్దం అని, ఒక సర్పంచ్ నుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి వరకు ఎదిగారని అన్నారు. ఆయన వ్యక్తిత్వమే ప్రజలకు దగ్గర చేసింది. ఇప్పటికీ జనాల గుండెల్లో నిలిచేలా చేసిందని ఈ రోజు ఆయన వర్ధంతి సందర్భంగా ఓసారి




స్మరించుకుందాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు టి. కుమార్ రావు, పిసిసి నాయకులు, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం మాజీ ఎంపీ నామ

**-అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సాగిన**

**కేసీఆర్ పదేళ్ల పాలన : మాజీ ఎంపీ నామ**

ప్రతిజ్ఞ ఏప్రిల్ 13

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరూ కట్టుబడి కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిందని గుర్తు చేశారు. తెలంగాణ అభివృద్ధిలో అంబేద్కర్ స్ఫూర్తి కీలకమని పేర్కొంటూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన నూతన సచివాలయానికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరు పెట్టడం, అలాగే హైదరాబాద్‌లో 125 అడుగుల ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గర్వకారణమని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను కేసీఆర్అ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఆచరణలో చూపించిందని చెప్పారు. రైతులకు రైతుబంధు, దళిత, బీసీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసినట్టు వివరించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో తొలిసారిగా దళితబంధు వంటి విప్లవాత్మక పథకాన్ని ప్రవేశపెట్టి దళిత వర్గాల ఆర్థిక పురోగతికి దోహదపడిందని తెలియజేశారు. అలాగే తెలంగాణలో బీఆర్ఎస్ హయంలోనే అత్యధిక సంఖ్యలో గురుకుల విద్యాసంస్థలను ఏర్పాటు చేసి, దళిత బహుజన పిల్లలకు ఉచిత విద్యను అందించి, వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచేలా తీర్చిదిద్దినట్లు తెలిపారు. నూతన పార్లమెంట్ భవనానికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరు పెట్టాలని కేసీఆర్ ఆదేశాల మేరకు 17వ లోక్‌సభలో తన వంతు కృషి చేసినట్లు నామ నాగేశ్వరరావు వెల్లడించారు.



# ఎమ్మెల్యే కనకయ్య చేత నూతన కో-ఆప్షన్ సభ్యులకు సన్మానం

ప్రతిజ్ఞ ఏప్రిల్ 13



ఇల్లందు పురపాలక సంఘంలో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా జరిగిన కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా గౌరవ శాసన సభ్యులు కోరం కనకయ్య హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ల ఏకగ్రీవ అమోదంతో నలుగురు కో-ఆప్షన్ సభ్యులు ఎన్నికయ్యారు. అనంతరం కమిషనర్ వారు నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్తగా కో-ఆప్షన్ సభ్యులుగా ఎన్నికైన మడుగు సాంబమూర్తి, పర్రె స్వర్ణలత, సైయద్ ఆజాం, ఎస్కే హసీనా గార్లను ఎమ్మెల్యే కోరం కనకయ్య పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు పురపాలక సంఘం చైర్మన్ దొడ్డా కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండేల రాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే కౌన్సిలర్లు షాఖ సైద్మియా, అజ్మీర వంశీ, వీణ కుష్బు, చిల్లా విజయభారతి, రాధాకమల్, కోరి గోపగాని రాజు, రేఖ స్వరూప, గందె పద్మ, మెరుగు కార్తీక్, మొగిలి లక్ష్మి, రంపా రమ్య, దండు సారయ్య, నీరుడు ఉపేంద్ర, సోనీ భాయ్, ఉల్లింగ విజయలక్ష్మి, పింగళి అనూహ్య, వీణ జాఫర్, నిలపు రమేష్, కొర్లపాటి కిరణ్, చెనిగరపు శృతి మరియు పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

# ఇల్లందులో అంగన్వాడి కేంద్రంలో ఘనంగా అక్షరాభ్యాసం, సీమంతం

ప్రతిజ్ఞ ఏప్రిల్ 13



ఇల్లందు మున్సిపల్ పరిధిలోని 24వ వార్డు అంగన్వాడి కేంద్రంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన అక్షరాభ్యాసం మరియు సీమంతం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడంతో పాటు స్థానిక గర్భిణీ స్త్రీలకు సాంప్రదాయబద్ధంగా సీమంతం నిర్వహించడం జరిగింది. ప్రతి అంగన్వాడి కేంద్రంలో ఈ కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తూ, స్థానిక మహిళలు, చిన్నారులు మరియు వారి తల్లిదండ్రులను ఆహ్వానించి వేడుకలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇల్లందు మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ హాజరై గర్భిణీ స్త్రీలు, చిన్నారులను ఆశీర్వదించారు. వీరితో పాటు ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీమతి అరుణ కుమారి పాల్గొన్నారు. అలాగే 24వ వార్డు మున్సిపల్ కమిషనర్ శ్రీమతి శృతి రమేష్, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు, ఆయాలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆరాధన గురుపూజ మహోత్సవాలకు డెకరేషన్ టెండర్ దక్కించుకున్న పొద్దుటూరు వాసి

కడపబ్యూరో ప్రతిజ్ఞ న్యూస్ రిపోర్టర్



కడప జిల్లా బ్రహ్మంగారి మఠం జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన మహోత్సవాలకు డెకరేషన్ లైటింగ్ టెండర్ను ప్రొద్దుటూరు కు చెందిన లక్ష్మీ సప్లయర్స్ యజమాని జగదీశ్వర్ రెడ్డి కి 5 లక్షల 80 వేల రూపాయలకు సొంతం చేసుకోవడం జరిగిందని మఠం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి తెలిపారు. ఈ కార్యక్రమం మఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాముల వారు ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి శ్రీపణి మరియు మేనేజర్ ఈశ్వరయాచారి ఆధ్వర్యంలో టెండర్ సభ్యుల సమక్షంలో మఠం సిబ్బంది వేణు గోపాల్, సుబ్బారాయుడు, కిరణ్ సాయి తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నారీశక్తి ప్రోగ్రాశీ

కడపబ్యూరో ప్రతిజ్ఞ న్యూస్ రిపోర్టర్




పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శామ్యూల్ డేవిడ్ రాజ్ ఆదేశాల మేరకు ఉమన్ రిజర్వేషన్ బిల్- 2023 నారి శక్తి వందన అభియాన్ కార్యక్రమం కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ అధ్యక్షులు డాక్టర్ ఎం వి సులోచన ఆధ్వర్యంలో మహిళా విద్యార్థులకు ఉమెన్ రిజర్వేషన్ 2023 బిల్లుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులు మాట్లాడుతూ మహిళలు విద్యా ఉద్యోగ రంగాలతో పాటుగా రాజకీయ రంగంలో కూడా ఉత్తమంగా రాణించాలంటే మహిళలకు సంబంధించిన రిజర్వేషన్ బిల్ 2023 ను పార్లమెంటు ఆమోదం తెలిపి చట్ట రూపంలో రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షులు డాక్టర్ సబితా, పర్వీన్, గుర్రమ్మ ఇతర అధ్యాపకులు విద్యార్థినులు పాల్గొన్నారు

## ఈ రోజు ఖమ్మం గ్రానైట్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరం



ప్రతిజ్ఞ ఏప్రిల్ 13

వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గిడ్డంగుల శాఖ చైర్మన్ శ్రీ రాయల నాగేశ్వరరావు గారు ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బను కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు ఈ యొక్క శిబిరం నందు ప్రముఖ హాస్పిటల్ హైదరాబాద్ యశోద వైద్య బృందం చే నిర్వహించబడింది ఖమ్మంలోని ప్రముఖ నేత్ర వైద్యులు వాసన్ ఐ కేర్ వారు మరియు సాయి కేర్స్ డెంటల్ వారు పాల్గొనడం జరిగింది ఈ శిబిరంలో డాక్టర్ పర్యవేక్షణలో ఉచితంగా పరీక్షలు నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో గుర్రాలపాడు ఏడవ డివిజన్ కౌన్సిలర్ బుర్ర మహేష్ గారు మరియు స్లాబ్ ఫ్యాక్టరీ ఓనర్ అసోసియేషన్ ఓనర్స్ అసోసియేషన్ సెక్రటరీ గారు గోపాల్ రావు గారు కోశాధికారి పరమేశ్వర్ రెడ్డి సభ్యులు పాల్గొని హర్షం వ్యక్తం చేయడం జరిగింది సంఘం సలహాదారులు అదాలత్ నరేంద్ర గారి వారి సలహా మేరకు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో మరో గౌరవ సలహాదారుడు వెంపటి వెంకటేశ్వర్లు గారు మరియు గౌరవ అధ్యక్షుడు వెంపటి ఉపేందర్ గారు అధ్యక్షుడు నూనావత్ కిషన్ మరియు సెక్రటరీ జానీ పాషా ట్రెజరర్ ఆకుల సైదులు గారు ఉపాధ్యక్షుడు ఎస్ నజీర్ పాషా గారు కాత్రం గిరి గారు గోవింద భద్రం గారు ట్రెజర్ 2 ముది శెట్టి రామూర్తి జెయింట్ సెక్రటరీ నామాల నరసింహారావు జుజ మెంబెర్స్ అంజి మిగతా గ్రూప్ సభ్యులు ఉట్ల రఘు గారు దుర్గా రావు వీరబాబు పాల్గొనడం జరిగింది ఈ వైద్య శిబిరం నందు ఖమ్మం అండ్ మార్కర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో సుమారు 500 మందికి వైద్య పరీక్షలు చేయించడం జరిగింది

## ప్రజావాణి' దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

-కలెక్టర్ చిత్రా మిశ్రా.

కరీంనగర్, ఏప్రిల్ 13 ప్రతిజ్ఞ )



ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 229 మంది అర్జీదారులు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు. త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు పాల్గొన్నారు.

## ఘనంగా స్వర్గీయ శాసనసభ మాజీ స్పీకర్ శ్రీపాద రావు వర్ధంతి వేడుకలు.



ప్రతిజ్ఞ హుజురాబాద్: ప్రతినిధి/ ఏప్రిల్ 13.

మాజీ శాసనసభ స్పీకర్ స్వర్గీయ శ్రీపాద రావు వర్ధంతి సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ ఆదేశాల మేరకు వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు ఈరోజు హుజురాబాద్ కాంగ్రెస్ కార్యాలయంలో వారికి ఘణమైన నివాళులు అర్పించడం జరుగుతుంది..ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొల్లూరి కిరణ్ కుమార్, హుజురాబాద్ మున్సిపాలిటీ చెర్మెన్ రోంటాల సుహాసిని మనోజ్ రావు,మహిళ మండల అధ్యక్షురాలు పుల్ల రాధ, హుజురాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మేకల తిరుపతి, హుజురాబాద్ 5వ వార్డు కౌన్సిలర్ సొల్లు సునిత, 19వ వార్డు కౌన్సిలర్ గొస్కుల రాజ్ కుమార్, మార్ 24వ వార్డు కౌన్సిలర్ నాంపెల్లి శ్రీనివాస్, 14వ వార్డు కౌన్సిలర్ వజ్జెపల్లి వెంకటేష్ ,9వ వార్డు కౌన్సిలర్ ఇమ్మడి సమ్మయ్య,28వ వార్డు కౌన్సిలర్ తాళ్ పెల్లి రమేష్,కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం వైస్ ప్రెసిడెంట్ లంకదాసరి లావణ్య ,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సొల్లు బాబు,హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ మిడిదొడ్డి రాజు, హుజురాబాద్ హనుమాన్ టెంపుల్ మాజీ చెర్మెన్ కొలిపాక శంకర్ ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి సదానందం,పంజాల రాంశంకర్ గౌడ్,యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యాక్షురాలు గొస్కుల నాగమణి, యూత్ కాంగ్రెస్ మండల వైస్ ప్రెసిడెంట్ మేకల రాజ్ కుమార్,సిర్సపెల్లి గ్రామశాఖ అధ్యక్షులు ఆడెపు ఐలయ్య,యండి అలీమ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు సుశీల, కొయల్కార్ బాలాజీ,లంకదాసరి ప్రవీణ్,జుపాక సంపత్,రావుల వెంకట్,సునిత,కల్పన,రాదక్క,యండి రియాజ్,యండి కరీమా తదితరులు పాల్గొన్నడం జరిగింది.

# ప్రజల ఆశీస్సులతో గెలిచిన కౌన్సిలర్లు తమ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించాలి మంత్రి తుమ్మల





ప్రతిజ్ఞ ఏప్రిల్ 13

రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు ని గండుగులపల్లిలోని వారి నివాసంలో గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఇటీవల అశ్వారావుపేట నూతన మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందిన కౌన్సిలర్లను మంత్రివర్యులకు పరిచయం చేశారు ప్రజల ఆశీస్సులతో గెలుపొందిన కౌన్సిలర్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు అలాగే అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధి, మంచినీరు, రహదారులు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వివరిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# అర్బన్, రూరల్ తహసిల్దార్ల ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఖమ్మం జిల్లా మాల మహానాడు నాయకులు





ఖమ్మం ఏప్రిల్ 13

ఖమ్మం అర్బన్ మండలం: ఖమ్మం అర్బన్ మండలం తహసీల్దార్ ను, ఖమ్మం రూరల్ మండలం తహసీల్దార్ ను ఖమ్మం జిల్లా మాల మహానాడు నాయకులు. రాష్ట్ర ఉపాధ్యక్షులు దళిత ఉద్యమ నాయకులు గుంతేటి వీరభద్రయ్య అధ్యక్షతన ఖమ్మం అర్బన్ రూరల్ మండలాల తహసీల్దార్ల ను మర్యాదపూర్వ కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాల్వతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో మాల మహానాడు ఖమ్మం జిల్లా అధ్యక్షులు దాసరి శ్రీను, తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షులు మెట్టు వెంకటేశ్వర్లు, కత్రం పుష్ప రాజ్, కరాటే వేణు, చింతమల్ల వెంకటేశ్వర్లు, కొరివి భాస్కర్, ఖమ్మం జిల్లా మాల మహానాడు మీడియా కన్వీనర్ పాగ యోనా తదితరులు అర్బన్ రూరల్ మండలాల తాసిల్దార్లను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది

# హెల్మెట్, సీటు బెల్ట్ ధరించిన వారికి పూలతో స్వాగతించిన పోలీసులు






ప్రతిజ్ఞ ఏప్రిల్ 13

రోడ్డు భద్రతను, ట్రాఫిక్ నిబంధనలను పాటించేలా ప్రోత్సహించడానికి నగరంలో హెల్మెట్, సీటుబెల్ట్ ధరించిన వాహనదారులను అభినందిస్తూ ఖమ్మం వన్ టౌన్ పోలీసులు పూలతో స్వాగతం పలుకుతూ.. ఏసీపీ రమణమూర్తి పర్యవేక్షణలో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఖమ్మం వన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ, మరణాల రేటును తగ్గించేందుకు రోడ్డు భద్రతనియమాలు పాటించేలా ప్రజలను సమాయత్వం చేసేందుకు హెల్మెట్, సీటు బెల్ట్ ధరించిన వారిని అభినందించడం, తద్వారా ఇతరులను కూడా ప్రోత్సహించడం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ప్రాణ రక్షణ ముఖ్యం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం. అలాగే, హెల్మెట్ లేకుండా వచ్చిన వారికి పోలీసులు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.ద్విచక్ర వాహనాలు డ్రైవింగ్ చేసే వారితో పాటు వెనుక కూర్చునే వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలు డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ సీట్ బెల్టులు ధరించాలన్నారు. - ఎడమ వైపు నుండి ఓవర్‌టేక్ చేయడం నిబంధన విరుద్ధమని, ఓవర్‌టేక్ కేవలం కుడి వైపు నుండి మాత్రమే చేయాలన్నారు. రక్షణాత్మక డ్రైవింగ్ దృష్టి పెట్టాలన్నారు. పేర్కొన్నారు.

# రక్షణాత్మక డ్రైవింగ్ దృష్టి పెట్టాలి : మధిర రూరల్ సిఐ మధు

ప్రతిజ్ఞ ఏప్రిల్ 13





రక్షణాత్మక డ్రైవింగ్ దృష్టి పెట్టాలని మధిర రూరల్ సిఐ మధు అన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం నుంచి 18వ తేదీ వరకు 'అరైవ్-అలైవ్' కార్యక్రమాల నిర్వహణలో భాగంగా ఈరోజు మధిర రూరల్ మండలం మాటూరు గ్రామలో అవగాహన కార్యక్రమం నిర్వహించి హెల్మెంట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, రోడ్డు వెంట ఉన్న వారు ఎక్కువ సంఖ్యలో మృతిచెందుతున్నారని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు డ్రైవింగ్ చేసే వారితో పాటు వెనుక కూర్చునే వారు కూడా సరైన హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలు డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ సీట్ బెల్టులు ధరించాలన్నారు. - ఎడమ వైపు నుండి ఓవర్‌టేక్ చేయడం నిబంధన విరుద్ధమని, ఓవర్‌టేక్ కేవలం కుడి వైపు నుండి మాత్రమే చేయాలన్నారు. భారీ వాహనాలు, నెమ్మదిగా వెళ్లే వాహనాలు ఎడమ వైపున, మిగిలినవి కుడి వైపున నడపాలన్నారు. ప్రధాన రహదారులపై పార్కింగ్ చేయరాదని, వాహనాలపై రేడియస్ స్టిక్కర్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. రక్షణాత్మక డ్రైవింగ్ దృష్టి పెట్టాలని, అప్రమత్తంగా, సురక్షిత ప్రయాణం చాల కీలకమని పేర్కొన్నారు. సురక్షితంగా రోడ్డు దాటడం కోసం పాఠశాలలు, పార్కుల దగ్గర రోడ్లపై నెమ్మదిగా నడపండి" అనే సైన్ బోర్డులను గమనించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో ఎస్సై లక్ష్మి భార్గవి, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన TGIDC చైర్మన్ మువ్వా




ప్రతిజ్ఞ ఏప్రిల్ 13

ఖమ్మంలి : ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలో విశ్రాంత అడిషనల్ డీసీపీ పి.వి. గణేష్ కుమారుడు డాక్టరు ఆదిత్య వర్ధన్ వివాహం ఇటీవల జరగగా వారి ఇంటి వద్ద నూతన వధూవరులను ను ఆశీర్వదించిన TGIDC చైర్మన్ మువ్వా విజయబాబు ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి మరియు మువ్వా గారి అభిమనులు పాల్గొనడం జరిగింది.

# పువ్వాడ నగర్ గ్రామంలో రోడ్ సేఫ్టీ పై అవగాహనపై గ్రామ సభ




ఖమ్మం బ్యూరో ఏప్రిల్ 13 (ప్రతిజ్ఞ పత్రిక)

రఘునాథపాలెం మండల కేంద్రంలోని పువ్వాడ నగర్ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు 99 రోజుల ప్రణాళిక లో భాగంగా గ్రామ పంచాయితీ కార్యాలయం నందు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించి ప్రజలకు రవాణా వ్యవస్థ, వాహనాలు నడిపే సమయంలో తీసుకో వలసిన జాగ్రత్తల పై రఘునాథపాలెం మండల సీఐ ఉస్మాన్ షరీఫ్, ఎస్ఐ నరేష్ అవాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో సర్పంచ్ షేక్ సిద్దిక్, కార్యదర్శి మహేష్, ఉపసర్పంచ్ ఆదురి రాణి, వార్డ్ సభ్యులు, స్కూల్ హెచ్ ఎం, అంగన్వాడీ, ఆశా, ఫీల్డ్ ఆఫీసర్, గ్రామాదీపిక వివిధ శాఖల అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన సర్పంచ్ షేక్ సిద్దిక్

ఖమ్మం బ్యూరో ఏప్రిల్ 13 (ప్రతిజ్ఞ పత్రిక)

రఘునాథపాలెం మండల కేంద్రంలో పువ్వాడ నగర్ గ్రామం లో తెలంగాణ ప్రభుత్వంచే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరావు దీవెనలతో నిర్మించబడిన కోమటి మాధవి -రమేష్ గృహప్రవేశం సందర్భంగా రిబ్బన్ కట్ చేసి ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆదురి రాణి, వార్డ్ సభ్యులు శ్రీదేవి, రజిత, గ్రామ పెద్దలు పాల్గొన్నారు




# చలివేంద్రం ప్రారంభం




ఖమ్మం బ్యూరో ఏప్రిల్ 13 (ప్రతిజ్ఞ పత్రిక)

ఖమ్మం నగరం: 3వ డివిజన్ పరిధిలోని బల్లేపల్లి బస్టాప్ వద్ద ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్,ఆర్ట్ ఆఫ్ లివింగ్ వాలంటీర్స్ ఖమ్మం వారి సంయుక్త ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయబడింది. ఈ చలివేంద్రాన్ని మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ యాకూబ్ వలి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్క్ ఇన్స్పెక్టర్ రామయ్య, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వాలంటీర్ పిల్లలమర్రి వెంకట్, నారాయణరావు, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం ద్వారా ప్రయాణికులు స్థానిక ప్రజలు చల్లని తాగునీరు మజ్జిగను పొందుతూ ఉపశమనం పొందుతున్నారు. ఈసేవా కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు అభినందిస్తూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో సహకార భావనను పెంపొందించడమే కాకుండా అవసరమైన వారికి ఉపశమనాన్ని అందిస్తాయని పాల్గొన్న వారు తెలిపారు.

# వరంగల్ ఆర్వో సబ్ రిజిస్ట్రార్-1 సస్పెన్షన్

వరంగల్, ఏప్రిల్, 13 (ప్రతిజ్ఞ )

వరంగల్ ఆర్వో సబ్ రిజిస్ట్రార్-1 జమలాపురి రామనర్సింహారావును సస్పెండ్ చేస్తూ కమిషనర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఉత్తర్వులు జారీ చేశారు ఈ ఉత్వర్వులు సోమవారం వరంగల్ కార్యాలయానికి చేరుకోనున్నాయి. ఈ నెల 3న అవినీతి నిరోధక శాఖ అధికారులు వరంగల్ ఆర్వో కార్యాలయం మీద దాడులు చేసి అక్రమ రిజిస్ట్రేషన్లు, అక్రమ ఆస్తులను గుర్తించారు. అవినీతికిపాల్పడినందుకుగాను సబ్ రిజిస్ట్రార్-2 ఆనంద్ను ఇప్పటికే సస్పెండ్ చేశారు. రామనర్సింహారావుపై చర్యల కోసం డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ జనరల్ సుభాషిణి కమిషనర్కు సమర్పించారు. ఆయనపై ఈ నెల 10న చర్యలు తీసుకున్నారు. కానీ సెలవులు రావడంతో ఉత్తర్వులు ఇంకా వరంగల్ కార్యాలయా నికి అందలేదు. వరంగల్ఆర్వో కార్యాలయంలో ఏక కాలంలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు అవినీతికి పాల్ప ఎడటం, అక్రమ ఆస్తులు కలిగి ఉండటం సంచలనం కలిగించింది. రామనర్సింహారావు, ఆనంద్కు మధ్య ఆన్లైన్లో రూ.43 లక్షల లావాదేవీలు జరిగినట్లు అవినీతి నిరోధక శాఖ గుర్తించిన విషయం తెలిసిందే.



# ఇండ్ల గణన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

-రాష్ట్ర సంచాలకులు భారతి హోళికేరి.



ఏప్రిల్, 13 (ప్రతిజ్ఞ )

జనగణనలో భాగంగా చేపట్టనున్న ఇండ్ల గణన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జనగణన తెలంగాణ రాష్ట్ర సంచాలకులు శ్రీమతి భారతి హోళికేరి తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర వ్యాప్త జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మునిసిపల్ కమిషనర్ల తో ఇండ్ల గణన కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై దృశ్య మాధ్యమ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంచాలకులు మాట్లాడుతూ, మే 11వ తేదీ నుండి ప్రారంభమయ్యే ఇండ్ల గణన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఖచ్చితత్వంతో నిర్వహించాలని, ఇందుకోసం ఇండ్ల జాబితా బ్లాక్‌లను సిద్ధం చేయడం, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం, మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించి ప్రక్రియలో పారదర్శకతను కాపాడాలని తెలిపారు. ఇండ్ల గణన, జనగణన ద్వారా సేకరించే సమాచారం ఆధారంగా అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో ఉపయుక్తం గా ఉంటుందన్నారు. హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్/ జీడబ్ల్యూఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, గృహాల గణన కార్యక్రమాన్ని నిబంధనల ప్రకారం సమన్వయంతో పకడ్బందీగా నిర్వహిస్తామని, జిల్లాలో గుర్తించబడిన ఇండ్ల జాబితా బ్లాక్‌లలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల సమన్వయంతో ఇట్టి ప్రక్రియను విజయవంతంగా చేపడతామని, ఇందుకోసం వారికి వెంటనే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలో ఇప్పటివరకు సుమారు 87 శాతం ఎన్యుమరేషన్ పూర్తయిందని, హౌస్ బ్లాక్ లిస్టింగ్ ప్రక్రియను నేటితో పూర్తిచేస్తామని, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి లక్ష్యాన్ని సాధిస్తామని ఇంచార్జి కమిషనర్ పేర్కొన్నారు. ఈ దృశ్య మాధ్యమ సమీక్షా సమావేశం లో సిపిఓ సత్యనారాయణ రెడ్డి, బల్దియా ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి బిర్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పోషణ్ పక్వాడ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలి

-కలెక్టర్ చాహత్ బాజ్ పాయి.



ఏప్రిల్, 13 (ప్రతిజ్ఞ )

పోషణ్ పక్వాడ వారోత్సవాలలో భాగంగా షెడ్యూల్ ప్రకారం విభిన్న కార్యక్రమాలను మండలాల వారీగా విజయవంతంగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో ఈ నెల 9 నుండి 23వరకు నిర్వహించే పోషణ్ పక్వాడ కార్యక్రమంపై సమన్వయ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పోషణ్ పక్వాడ కార్యక్రమంపై వివిధ అంశాలను జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ తెలియజేయగా సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా తల్లీబిడ్డల ఆరోగ్యం పట్ల కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలతో పాటు పాఠశాలల్లో కార్యక్రమాలను చేపట్టాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులలో సృజనాత్మకను పెంపొందించే విధంగా విభిన్న కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులతో యోగా కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఇందుకు అంగన్వాడీ టీచర్లకు యోగా సంబంధిత అంశాలపై శిక్షణ ఇవ్వాలన్నారు. చిన్నారులు ఆటలు ఆడుకునేవిధంగా అంగన్వాడీ కేంద్రాలలో ఆటవస్తువులను అందుబాటులో ఉంచాలన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమాలలో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల చిన్నారులకు ఉపయోగపడే విధంగా డొనేట్ టాయ్స్ కార్యక్రమం చేపట్టి వివిధ ఆటవస్తువులు సేకరించేవిధంగా కార్యక్రమం చేపట్టాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల వారీగా కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, అడిషనల్ డీఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఎల్పీవో గంగా భవాని, మెప్మా కోఆర్డీనేటర్ రజిత రాణి, జీసీడీవో సునీత, పోషణ్ పక్వాడ జిల్లా కో ఆర్డీనేటర్ సుమలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.